క్లుప్తంగా

అల్లా ఆశీస్సులు అందరిపై ఉండాలి



భోజనం వడ్డిస్తున్న ఎంపీ అభ్యర్థి శాంతమ్మ

హిందూపురం: పవిత్ర రంజాన్ మాసంలో కఠోన ఉపవాస దీక్షలు కొనసాగిస్తున్న ముస్లిం కుటుంబ సభ్యులతో పాటు ప్రజలందరిపై అల్లా ఆశీస్సులు ఉండాలని వైఎస్సార్‌సీపీ హిందూపురం ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ అన్నారు. పట్టణంలోని బోయపేటలో మైనార్టీ బోయపేట యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు శాంతమ్మతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘని, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్‌చైర్మన్ బలరామిరెడ్డి తదితరులు హాజరయ్యారు.

మిస్సింగ్ కేసు ఛేదించిన పోలీసులు



ఈడిగ రవిని తహసీల్దార్ ముందు హాజరుపరచిన పోలీసులు

పెనుకొండ రూరల్: మండలంలోని కొండంపల్లి గ్రామానికి చెందిన ఈడిగ రవి అదృశ్యమైనట్లు భార్య ప్రవల్లిక పోలీసులకు వారం క్రితం ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలోనే దర్యాప్తు ప్రారంభించిన పట్టణ పోలీసులు మంగళవారం ఉదయం స్థానిక రైల్వేస్టేషన్ వద్ద ఈడిగ రవిని అదుపులోకి తీసుకున్నారు. తహసీల్దార్ ఉదయ శంకర్ ముందు హాజరుపరచినట్లు హెడ్‌కానిస్టేబుల్ దాదాపీర్ తెలిపారు.

31 మంది గైర్హాజరు

పరిగి: మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. మంగళవారం జరిగిన బయాలజీ పరీక్షకు 787 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా...756 మంది మాత్రమే పరీక్ష రాశారని ఎంఈఓ–2 శేషాచలం తెలిపారు. 31 మంది గైర్హాజరైనట్లు చెప్పారు.

గోరంట్ల: పదో తరగతి సైన్స్–2 పరీక్ష మంగళవారం ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈఓ గోపాల్ తెలిపారు. 1270 మంది పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 1205 మంది హాజరైనట్లు చెప్పారు. 65 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలోకి చేరుతున్న వారితో జీబీ శివకుమార్

గుడిబండ: మండల పరిధిలోని జంబులబండ, జవనడుకు గ్రామాలకు చెందిన భాస్కర్, సుబ్బరాయుడు, రాజు, నాగరాజుతో పాటు దాదాపు పది కుటుంబాలు మంగళవారం వైఎస్సార్‌సీపీలోకి చేరారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జీబీ శివకుమార్ వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సర్పంచులు కరుణాకర్, అశ్వత్, రాష్ట్ర ఎస్టీ సెల్ జాయింట్ సెక్రటరీ గిరి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

పావగడ: స్థానిక బస్టాండ్‌లో మంగళవారం ఆకస్మికంగా చోటు చేసుకున్న బైకు ప్రమాదంలో నాగలమడక గ్రామానికి చెందిన మంజునాథ్, మారుతీ తీవ్రంగా గాయపడ్డారు. బాధితులు ద్విచక్ర వాహనంలో బస్టాండ్ లోపలికి వస్తుండగా రోడ్డుపైకి వస్తున్న ఓ ప్రైవేట్ బస్సు బైకును ఢీ కొంది. మంజునాథ్‌కు తీవ్ర గాయాలుకాగా, మారుతీకి స్వల్ప గాయాలయ్యాయి. మంజునాథ్‌ను తుమకూరుకు తరలించారు. ప్రమాదానికి కారణమైన బస్సును పోలీసులు స్వాధీనం చేసుకొని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

చింతచెట్ల నరికివేత



నరికి వేయడంతో నేలకు ఒరిగిపోయిన చింతచెట్లు

లేపాక్షి: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న చింతచెట్లను అక్రమంగా నరికి వేయడంతో ఆ భూమికి సంబంధించిన రైతు, రియల్‌ఎస్టేట్ వ్యాపారి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి అటవీశాఖ అధికారులు కేసు నమోదు చేశారు. ఎలాంటి అనుమతి తీసుకోకుండా 8 చింత చెట్లను సోమవారం అర్ధరాత్రి కొట్టించారు. పక్కనే పోలీసుస్టేషన్ ఉన్నా చెట్లను అక్రమంగా కొట్టించడం చర్చనీయాంశంగా మారింది. తహసీల్దార్ బాలనరసింహులు ఈ ఘటనపై అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేయగా ఆ శాఖ సెక్షన్ ఆఫీసర్ అక్బర్ సిబ్బందితో అక్కడి చేరుకొని నష్టాన్ని అంచనా వేశారు. శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు అక్బర్ పేర్కొన్నారు.

జగనన్నతోనే ప్రజా రంజక పాలన

- సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీకే ఓటేయాలి
- ఆత్మీయ పలకరింపులో మంత్రి ఉషశ్రీచరణ్



పెనుకొండ : 13వ వార్డు చెరువు రోడ్డులో ఆత్మీయ పలకరింపులో పాల్గొన్న మంత్రి ఉషశ్రీచరణ్

పెనుకొండ: 'ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ప్రజలందరికీ పక్కాగా సంక్షేమ పథకాలు అందుతాయి. గత ఐదేళ్లలో నవరత్నాలతో ప్రతి కుటుంబంలో సంతోషాన్ని నింపారు. జగనన్నతోనే ప్రజా రంజక పాలన సాధ్యం' అని రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమ శాఖామంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ చరణ్ పేర్కొన్నారు. పెనుకొండ మున్సిపల్ పరిధిలోని 13వ వార్డులోని చెరువు రోడ్డులో మంగళవారం మున్సిపల్ కౌన్సిలర్ చంద్రకళ, వైఎస్సార్‌సీపీ నాయకులు బోయ త్రిష్టప్ప ఆధ్వర్యంలో మంత్రి ఆత్మీయ పలకరింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉషశ్రీచరణ్ వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులతో కలసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ, అభివృద్ధిని వివరించారు. ఏఏ పథకం ద్వారా ఎంత మేర లబ్ధి చేకూరిందన్న విషయాన్ని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ ఎన్నికల హామీలో చెప్పిన విధంగానే సీఎం వైఎస్ జగన్ 99 శాతం హామీలను నెరవేర్చారన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎవరూ చేయని విధంగా పేదలు, మహిళలు, ఇతర అన్ని వర్గాల ప్రజలకు మంచి చేసిన ఏకైక సీఎం జగనేనన్నారు. రూ.1.75 లక్షల కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి వేసి ఎక్కడా అవినీతి అన్న పదానికి తావు లేకుండా చేశారని చెప్పారు. అర్హత ఉంటే చాలు ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందించారని కొనియాడారు. జగనన్న కాలనీలు, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతిదీవెన, అమ్మఒడి, వైఎస్సార్ చేయూత, నాడు – నేడు, రైతు భరోసా వంటి అనేక పథకాలతో ప్రజా రంజక పాలన సాగించారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఆర్థికంగా, రాజకీయంగా ఉన్నత స్థానాలకు చేర్చిన గొప్ప వ్యక్తి ముఖ్యమంత్రి జగన్ అన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుందామని పిలుపునిచ్చారు. పెనుకొండలో తనను భారీ మెజారీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రజలు రోడ్లు, డ్రైనేజీలు, కొళాయిలు, వీధిలైట్లు వేయించాలని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన మంత్రి ఉషశ్రీచరణ్ తగిన తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ బోయ నరసింహ, నగర పంచాయతీ వైస్ చైర్మన్ సునీల్, కౌన్సిలర్లు రఘునాథరెడ్డి, సుధాకరరెడ్డి, భాస్కర్‌నాయక్, శేషాద్రి, రామాంజినేయులు, వైస్ ఎంపీపీ రామాంజినేయులు, సింగిల్‌విండో అధ్యక్షుడు సూర్యప్రకాష్‌రెడ్డి, నాయకులు జయశంకరరెడ్డి, రాము, బోయబాబు, ఫరీద్, యాసిన్, వెంకటేష్, సిక్బతుల్లా, నేమతుల్లా, గోపాల్, తిమ్మారెడ్డి, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

పెనుకొండ: పెనుకొండ పట్టణంలోని చెరువు రోడ్డులో టీడీపీకి చెందిన అశోక్, గోవిందు మంత్రి ఉషశ్రీచరణ్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలని మంత్రి కోరారు. వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ బోయ నరసింహ, కౌన్సిలర్ సద్దాం, సుధాకరరెడ్డి, రఘునాథరెడ్డి, నాయకులు శంకరరెడ్డి, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని పెరమాళ్లపల్లి గ్రామానికి చెందిన పది కుటుంబాలకు చెందిన వారు టీడీపీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగళవారం పెనుకొండలోని మంత్రి కార్యాలయంలో వారు ఉషశ్రీచరణ్‌ను కలిశారు. పార్టీలో చేరిన వారికి కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కృష్ణకుమార్‌యాదవ్, సుధాకర్‌యాదవ్, అంజినప్ప, కురబ నారాయణ స్వామి, రవియాదవ్, కురబ శివ, విశ్వనాథ, మల్లికార్జున తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేయాలని, తగిన ప్రాధాన్యత ఇస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనరసప్ప, మంత్రి ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి, నార్శింపల్లి మాజీ సర్పంచ్ శివారెడ్డి, నాయకులు రాజేష్ యాదవ్, ఈశ్వర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పరిగి: మండలంలోని ఊటుకూరు పంచాయతీలో మంగళవారం మంత్రి ఉషశ్రీచరణ్ ప్రచారం నిర్వహించారు. బసవనపల్లి కాలనీ, ఊటుకూరు, అక్కంపల్లిలో ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. అనంతరం బసవనపల్లి కాలనీ, ఊటుకూరు గ్రామాల్లో సుమారు 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి రమణ, జిల్లా కార్యదర్శి ప్రభాకర్, సర్పంచ్ దిలీప్, ఎంపీటీసీ అమరావతి తదితరులు పాల్గొన్నారు.



గోరంట్ల: వైఎస్సార్‌సీపీలో చేరుతున్న పెరమాళ్లపల్లి గ్రామస్తులు



పెనుకొండలో చెరువు రోడ్డులో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న గోవిందు



బసవనపల్లి కాలనీలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న వారితో మంత్రి ఉషశ్రీచరణ్



మంత్రి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న ఊటుకూరు వాసులు

టీడీపీలో మళ్లీ లుకలుకలు

- కార్యకర్తల సమావేశంలో బీకే, సవితమ్మ వర్గాల పోటాపోటీ నినాదాలు

పెనుకొండ: టీడీపీ ఎంపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బీకే. పార్థసారథి ఇంటి వద్ద మంగళవారం టీడీపీ కార్యకర్తల సమావేశంలో మరోసారి లుకలుకలు బయట పడ్డాయి. సమావేశానికి నియోజకవర్గ పరిశీలకుడు నరసింహారావు, ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి, ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ హాజరయ్యారు. సమావేశం జరుగుతున్న సమయంలో ఒక్కసారిగా బీకే అనుచరులు జై బీకే అంటూ కేకలు వేశారు. మరికొందరు అదేస్థాయిలో జై సవిత అంటూ నినాదాలు చేశారు. ఒకరినొకరు తోసుకునే పరిస్థితి వచ్చింది. అయితే పలువురు నాయకులు ఇరువర్గాలకు నచ్చజెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది. కొన్నేళ్లుగా సవితమ్మ, బీకే వర్గాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటున్న విషయం తెలిసిందే. సవితమ్మ ఎమ్మెల్యే అభ్యర్థి టికెట్ దక్కించుకొని బీకేకు షాక్ ఇచ్చింది. ఆత్మరక్షణలో పడిన బీకే పడరాని పాట్లు పడి ఆఖరికి ఎంపీ అభ్యర్థిగా టికెట్ దక్కించుకున్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్నా ఇరు వర్గాల మధ్య సఖ్యత కుదరకపోవడంతో తమ్ముళ్లు ఆందోళన చెందుతున్నారు.

వేంకటరమణస్వామికి రూ.2.44 లక్షల ఆదాయం



హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలోని పేట వేంకటరమణ స్వామి ఆలయ హుండీ కానుకల ద్వారా రూ.2.44 లక్షల ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ నరసింహమూర్తి తెలిపారు. మంగళవారం ఆలయ శాశ్వత హుండీ కానుకలను లెక్కించారు. జిల్లా దేవాదాయ అధికారి నరసింహరాజు పర్యవేక్షణలో ఆలయ నిర్వహణాధికారితో పాటు ఆలయ చైర్మన్ భగీరథి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లను టెర్రరిస్టులతో పోలుస్తారా?



అగళి మండలం ఇరిగేపల్లిలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప



వివిధ సంఘాల సభ్యులతో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

- టీడీపీ, జనసేన నాయకులపై ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప ఆగ్రహం

అగళి: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికీ అందిస్తూ సేవా భావాన్ని చాటుకుంటున్న వలంటీర్లను టీడీపీ, జనసేన పార్టీల నాయకులు టెర్రరిస్టులతో పోల్చడం సరికాదని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీకాళహస్తి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుధీర్‌రెడ్డితో పాటు పలుమార్లు జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ కూడా వలంటీర్లను అవమానపరిచే రీతిలో మాట్లాడారన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వలంటీర్లపై టీడీపీ, జనసేన పార్టీల నాయకులు చేస్తున్న వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు. ప్రజలకు నిస్వార్థంగా సేవలందిస్తున్న వారిని నిందిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రజలంతా వలంటీర్లను తమ సొంత బిడ్డల్లా ఆదరిస్తుంటే టీడీపీ, జనసేన నాయకులు మాత్రం నక్సలైట్లు, టెర్రరిస్టులతో పోలుస్తుండటం బాధాకరమన్నారు. వలంటీర్ వ్యవస్థతో వైఎస్సార్‌సీపీకి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థల ద్వారా ఇంటి ముంగిటకే సంక్షేమ ఫలాలు అందించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. టీడీపీ, బీజేపీ , జనసేన పార్టీలు ఒక్కటిగా వస్తున్నాయని, అయినా వచ్చే ఎన్నికల్లో గెలుపు మాత్రం వైఎస్సార్‌సీపీదేనన్నారు. మరోసారి సీఎంగా వైఎస్ జగన్ బాధ్యతలు చేపట్టి సుపరిపాలన అందిస్తారన్నారు.

జోరుగా ఇంటింటి ప్రచారం

అగళి: క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేసి మరోసారి మడకశిరలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగరవేద్దామని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నాయకులతో కలిసి ఆయన మంగళవారం ఇరిగేపల్లి గ్రామంలో పర్యటించారు. పలువురు నాయకుల ఇళ్లకు వెళ్లి పార్టీ గెలుపునకు అందరూ కలిసి సమష్టిగా పనిచేద్దామన్నారు. ఈ సందర్భంగా ఈరలక్కప్ప మాట్లాడుతూ టీడీపీ పాలనకు జగనన్న పాలనకు ఉన్న తేడాను ప్రజలు గమనించి ఓటేయాలని సూచించారు. టీడీపీ హయాంలో ఏ సంక్షేమ పథకం కావాలన్నా జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్లు వివరించారు. ఎన్నికల్లో టీడీపీ నాయకులు చెప్పే మాయ మాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మహేంద్రప్ప, వైస్ ఎంపీపీ గాయత్రి, నాయకులు చంద్రప్ప, హేమంతరాజు, సురేష్, నాటరాజు, వెంకటస్వామి, సతీష్, మధు, సుర్యనారాయణరెడ్డి, లింగరాజు, రంగనాథ, మంజునాథ్, డీలర్ శ్రీనివాస్, తిమ్మరాయప్ప తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ నాయకుడు గోవిందప్ప ప్రమాదంలో గాయపడి చికిత్స తర్వాత ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప.. గోవిందప్పను ఆయన ఇంటికెళ్లి పరామర్శించారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం

మడకశిరరూరల్: సార్వత్రిక ఎన్నికల్లో మడకశిరలో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా పని చేయాలని ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప కోరారు. చందకచెర్ల గ్రామంలో పాఠశాల కమిటీ చైర్మన్ శేషాద్రి ఇంట్లో నాయకులను కలిసి పార్టీ గెలుపునకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ కార్యకర్తలు ఈరలక్కప్ప సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి, జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు హనుమంతరెడ్డి, వార్డు సభ్యులు రమేష్, వివిధ సంఘాల సభ్యులు పుట్టయ్య, రఘుపతి, దాసన్న, మంజునాథ్, అంజనరెడ్డి, ధని, నాగనాయక్, హనుమంతరాయుడు, శ్రీనప్ప, గోపి, ఖలీల్‌సాబ్, రంగానాయక్, జయరామ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని హేమావతి, ఉప్పారట్టి గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ గగన, ఆలయ కమిటీ చైర్మన్ మంజునాథ ఇళ్లకు వెళ్లి వైఎస్సార్‌సీపీ గెలుపుకు కృషి చేయాలన్నారు. అనంతరం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈరన్న, సర్పంచ్ తిప్పేస్వామి, ఎంపీటీసీ జయరామ్, తన్వీర్‌గౌడ్, నరసింహరాజు, చిన్నీరప్ప,తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సదుపాయాలు కల్పించడం హర్షణీయం

హిందూపురం: స్థానిక సుబ్రమణ్యం ఆలయంలో షష్టి సందర్భంగా ప్రత్యేక పూజలకు సదుపాయలు కల్పించడం పట్ల ఆలయ నిర్వాహలు వైఎస్సార్‌సీపీ హిందూపురం ఎమ్మెల్యే అభ్యర్థి టీఎన్.దీపిక, ఎంపీ అభ్యర్థి బి.శాంతమ్మలను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వారికి స్వామి వారి తీర్థ ప్రసాదాలు, ఫొటోలు అందించి ధన్యవాదలు తెలిపారు. అన్ని సౌకర్యాలు కల్పించడంతో ఫంగాణీ ఊరేగింపు కూడా విజయవంతమైందన్నారు. కార్యక్రమంలో గురుస్వామి, సతీష్, కలై, మణి తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి టీఎన్.దీపికకు తీర్థ ప్రసాదాలు అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా రాజశేఖర్

హిందూపురం అర్బన్: హిందూపురం న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా ఈ.రాజశేఖర్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి, సీనియర్ న్యాయవాది రామరత్నం శాస్త్రి పర్యవేక్షణలో మంగళవారం బార్ అసోషియేషన్ అధ్యక్ష స్థానానికి న్యాయవాదులు నాగరాజు, హిదయతుల్లాఖాన్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 123 మంది ఓటర్లు ఉండగా 110 ఓట్లు పోలయ్యాయి. ఇందులో రాజశేఖర్‌కు 47, వన్నూరప్పకు 43, కెహెచ్ గోపాల్‌కు 20 ఓట్లు వచ్చాయి. దీంతో రాజశేఖర్ గెలుపొందినట్లు ప్రకటించారు. అనంతరం ప్రధాన కార్యదర్శిగా జి. శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షుడిగా మురళీ, ఆంజనేయులు, సంతోషికుమారి, సంయుక్త కార్యదర్శులుగా రత్నమ్మ, వెంకటేశ్వరరావు, కోశాధికారిగా ఈశ్వరప్ప, గ్రంథాలయ ఇన్‌చార్జిగా రవిచంద్రా, మీడియా కోఆర్డినేటర్‌గా ఫణిభూషణ్‌లను ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎన్నికైన రాజశేఖర్‌కు సన్మానించారు.



రాజశేఖర్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

పూరిల్లు దగ్ధం

పెనుకొండ రూరల్: నగర పంచాయతీ పరిధిలోని ఇస్లాపురం గ్రామంలో సోమవారం అర్ధరాత్రి పూరి ఇల్లు దగ్ధమైంది. అగ్నిమాపక అధికారులు తెలిపిన వివరాల మేరకు... ఇస్లాపురానికి చెందిన బోయ నరసింహులు సోమవారం సాయంత్రం తన నివాసంలో దేవుని పూజ, దీపారాధన చేశారు. అయితే దీపం వెలుగులు ఇంటిపై కప్పుకు వ్యాపించాయి. దీంతో మంటలు చెలరేగాయి. స్థానికులు వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది సకాలంలో మంటలను అదుపు చేసి సమీప గృహాలకు మంటలు వ్యాపించకుండా చర్యలు చేపట్టారు. పూరిల్లు పూర్తిగా దగ్ధమవగా ఇంట్లోని బట్టలు, బియ్యం, నగదు దాదాపు రూ.2 లక్షల వరకూ నష్టం వాటిల్లిందని బాధితుడు నరసింహులు తెలిపారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

లేపాక్షి: మండలంలోని కొండూరు గ్రామ పంచాయతీ పరిధిలోని తిమ్మగానపల్లి గ్రామంలో వెలిసిన ముత్యాలమ్మకు వైఎస్సార్‌సీపీ హిందూపురం ఎమ్మెల్యే అభ్యర్థి టీఎన్.దీపికా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ప్రార్థించినట్లు ఆమె తెలిపారు.

గుండెపోటుతో అర్చకుడి మృతి



పవన్‌కుమార్ (ఫైల్)

హిందూపురం అర్బన్: పట్టణంలోని బెంగళూరు రోడ్డులోని అయ్యప్ప స్వామి దేవాలయం అర్చకుడు పవన్‌కుమార్ (31) మంగళవారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతి చెందారు. సోమవారం రాత్రి చిలమత్తూరులో జరిగిన నరసింహస్వామి ఉత్సవాల్లో పాల్గొని ఉదయం హిందూపురం చేరుకున్న పవన్ అయ్యప్పస్వామి ఆలయంలో పూజలు ముగించుకొని మోతుకపల్లి వెళ్లి వచ్చాక ఇంటి వద్ద గుండెపోటుతో చనిపోయినట్లు స్థానికులు తెలిపారు. ఆరు నెలల క్రితం పవన్‌కు వివాహం కాగా భార్య దూరంగా ఉంటోందన్నారు.



దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కరుణించమ్మా స్వారమ్మ తల్లీ..

పావగడ: తాలూకాలోని మద్దె, కరె క్యాతనహళ్లి గ్రామాలకు చెందిన భక్తుల కొంగు బంగారం స్వారమ్మదేవి, శంకరలింగేశ్వరస్వామి జాతరోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం 4 గంటల సమయంలో స్వారమ్మదేవి, శంకరలింగేశ్వరస్వామికి అభిషేకం, కలశ స్థాపన పూజలు నిర్వహించారు. రాత్రి అగ్నిగుండం, బెళ్లార్తి సేవలు జరిగాయి.



అలంకరణలో స్వారమ్మదేవి

అనుమతులు తీసుకోవాలి

హిందూపురం టౌన్: ఎన్నికల నేపథ్యంలో వాహనాలు, లౌడ్‌స్పీకర్స్, హోర్డింగ్స్, కటౌట్స్ తదితర వాటికి అన్ని రాజకీయ పార్టీలు తప్పని సరిగా అనుమతులు పొందాలని తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు.

కాంగ్రెస్‌కు మాజీ కన్వీనర్ గుడ్‌బై



వైఎస్సార్‌సీపీలో చేరిన భాస్కర్‌రెడ్డి

పరిగి: కాంగ్రెస్ పార్టీ మండల మాజీ కన్వీనర్ ఊటుకూరు భాస్కర్‌రెడ్డి తన కాంగ్రెస్ సభ్యత్వంతో పాటు పార్టీకి రాజీనామా చేశారు. మంత్రి ఉషశ్రీచరణ్ భర్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు చరణ్‌రెడ్డి సమక్షంలో మంగళవారం ఆయన వైఎస్సార్‌సీపీలో చేరారు. సీఎం జగన్ చేపట్టిన సంక్షేమాభివృద్ధికి ఆకర్షితుడినై పార్టీలో చేరినట్లు భాస్కర్‌రెడ్డి తెలిపారు.

పీఎల్‌డీ బ్యాంకు అధ్యక్షుడిగా పెద్దారెడ్డి

పావగడ: స్థానిక పీఎల్‌డీ బ్యాంకు అధ్యక్షుడిగా సీనియర్ కాంగ్రెస్ నేత మీనకుంటపల్లి ఆర్ పెద్దారెడ్డి మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన మాట్లాడుతూ తనను ఏకగ్రీవంగా ఎన్నుకోడానికి సహకరించిన స్థానిక ఎమ్మెల్యే వెంకటేష్, మాజీ మంత్రి వెంకటరమణప్పకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మడకశిరకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు రామిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, నరసింహమూర్తి తదితరులు నూతన అధ్యక్షుడు పెద్దారెడ్డిని సన్మానించారు.